క్లుప్తంగా

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



ఆదోనిలో డిపో ఎదుట నిరసన తెలియజేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

ఆదోని రూరల్: ఆదోని ఏపీఎస్ ఆర్టీసీలో పనిచేస్తున్న రెగ్యులర్ ఉద్యోగులు, కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని ఎస్‌డబ్ల్యూఎఫ్ డిపో గౌరవాధ్యక్షుడు అజీమ్‌ఖాన్, అధ్యక్షుడు వై.పి.ప్రసాద్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక డిపో ముందు ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ కార్మిక సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వాపోయారు. నైట్ అవుట్, డే అవుట్ అలవెన్స్‌లు, ఇన్సెంటివ్‌లు, టీఏ బిల్లులు చెల్లించాలన్నారు. 1/2019 సర్క్యులర్ అమలు చేయాలన్నారు. చీటికిమాటికి కేసులు రాసేవిధానం ఆపాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ సెక్రటరీ ఎ.రవి, జాయింట్ సెక్రటరీ ఎంఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అమరవీరులను స్మరించుకుందాం



అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న ఏఐఎఫ్‌టీయూ నాయకులు

ఆదోని రూరల్: భూమికోసం, భుక్తి కోసం, పేద ప్రజల విముక్తి కోసం ప్రజాయుద్ధంలో పోరాడుతూ నేలకొరిగిన అమరవీరులను స్మరించుకుందామని ఏఐఎఫ్‌టీయూ నాయకులు గంగన్న అన్నారు. బుధవారం మండలంలోని ధణాపురం గ్రామంలో గంగన్న, సుజ్ఞానమ్మ అధ్యక్షతన అమరవీరుల స్మారక సభ నిర్వహించారు. అమరవీరుల స్థూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పోరాటంలో అమరులైన కామ్రేడ్ ఉల్లిగడ్డల వీరన్న, నరసింహుల సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు సుభాస్, రవి, అనిల్, లక్ష్మన్న, హుసేని తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రాములమ్మ

కోసిగి: కౌతాళం మండలం తిప్పల దొడ్డి గ్రామానికి చెందిన రాములమ్మ అనే మహిళ పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు ఆమె కొద్ది కాలంగా మనోవేదనతో బాధపడుతుండేది. బుధవారం ఉదయం ఆమె పొలానికి వచ్చి బోరు వద్ద బట్టలు శుభ్రం చేస్తూ పంటకు పిచికారీ చేసేందుకు ఉంచిన పురుగుల మందును సేవించి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయింది. గమనించి కుటుంబసభ్యులు వెంటనే బైక్‌పై కోసిగి ప్రాథమిక ఆరోగ్యం కేంద్రానికి తీసుకెళ్లారు. అక్కడ డాక్టర్ మనోజ్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

టీడీపీ నాయకుడి బెల్ట్ షాపుపై దాడులు



అక్రమ మద్యాన్ని చూపుతున్న ఎస్ఐ శ్రీనివాసులు

నందవరం: మండల పరిధిలోని కనకవీడు గ్రామంలో బెల్టు షాపులపై పోలీసులు దాడులు చేశారు. బుధవారం ఎస్ఐ శ్రీనివాసుల ఆధ్వర్యంలో పోలీసులు దాడులు చేపట్టి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు డబ్బ ఈరన్న నిర్వహిస్తున్న బెల్ట్ షాపులో అక్రమంగా నిల్వ వుంచిన 12 బీర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అక్రమ మద్యాన్ని సీజ్ చేసి, డబ్బ ఈరన్నపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఉపాధ్యాయుడి చికిత్సకు ఆర్థిక సాయం



ఉపాధ్యాయుడు నీలకంఠకు నగదు అందిస్తున్న ఎస్టీయూ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని ఎంఎస్ జెడ్పీ బాలికల హైస్కూల్‌లో పనిచేస్తున్న ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు నీలకంఠ మెదడులో రక్తనాళాల సమస్యతో కర్నూలులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆయనకు శస్త్ర చికిత్స కోసం ఎస్టీయూ ఆధ్వర్యంలో ఆ సంఘ నాయకులు వెంకటేశ్వర్లు, ప్రసన్నరాజులు ఉపాధ్యాయుల నుంచి సేకరించిన రూ.3లక్షలను బుధవారం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నీలకంఠకు అందజేశారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గోకారి, జనార్దన్, మాజీ రాష్ట్ర కార్యదర్శి తిమ్మన్న, నాయకులు మహమ్మద్ షఫి, బసవరాజు తదితరులు పాల్గొన్నారు.

ఒకే గది.. ఐదు తరగతులు

- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో విజయభాస్కరరెడ్డి కాలనీలో పాఠశాల ఏర్పాటు
- నాడు – నేడు కింద భవనం నిర్మాణం
- భారీగా పెరిగిన విద్యార్థుల సంఖ్య
- గదులు లేక ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం



కొత్తగా నిర్మించిన పాఠశాల భవనం



విద్యా బోధన కొనసాగిస్తున్న ఉపాధ్యాయులు

ఆదోని సెంట్రల్: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆదోని పట్టణంలోని విజయభాస్కరరెడ్డి కాలనీలో ఎన్. రామయ్య పురపాలక ప్రాథమిక పాఠశాల ఏర్పాటు చేసింది. నాడు–నేడు పనుల కింద గత ప్రభుత్వం పాఠశాలలో మౌలిక సదుపాయాలతో పాటు విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదిని నిర్మించింది. అయితే అయిదేళ్లలో విద్యార్థుల సంఖ్య భారీగా పెరగడంతో ఆ గది సరిపోవడంలేదు. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఐదు నెలలవుతున్నా ప్రభుత్వ పాఠశాలల వైపు కన్నెత్తి చూడటంలేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పాలకులు స్పందించి అదనపు తరగతి గదులను నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

గత ఎమ్మెల్యే చొరవతో..

ఆదోని పట్టణంలోని విజయభాస్కరరెడ్డి కాలనీ, భీమ్‌రెడ్డి కాలనీ, వైఎస్సార్ కాలనీలలో కూలీ పనులు చేసుకుని జీవనం సాగించే వారు ఎక్కువగా ఉన్నారు. వారు తమ పిల్లలను బడికి పంపాలంటే కల్లుబావి లేదా శంకర్ నగర్, ఆర్ఆర్ లేబర్ కాలనీలో ఉన్న పాఠశాలలకు పంపించాల్సి వచ్చేది. అయితే పిల్లలు బడికి వెళ్లాలంటే ఆదోని–ఆలూరు మెయిన్ రోడ్డును దాటి వెళ్లే వారు. దీంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదాలు ముంచుకొస్తుందోనని భయాందోళనకు గురైన ఆయా కాలనీలకు చెందిన ప్రజలు గత ఎమ్మెల్యే వై.సాయి ప్రసాద్‌రెడ్డికి సమస్యను విన్నవించారు. ఆయన చొరవతో పురపాలక కార్యాలయం సమీపంలో ఉన్న ఎన్.రామయ్య ప్రాథమిక పాఠశాలను 2019లో భాస్కర్ రెడ్డి కాలనీలోకి మార్చారు. అయితే అప్పట్లో ఒక ఇంటిని అద్దెకు తీసుకొని పాఠశాలను ప్రారంభించారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగానే ఉపాధ్యాయులను కూడా నియమించారు.

నాడు–నేడు కింద రూ. 21 లక్షలతో భవన నిర్మాణం

గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యార్థులకు తరగతి గదులతో పాటు అన్ని సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో నాడు- నేడు పథకానికి శ్రీకారం చుట్టారు. అందులో భాగంగానే పురపాలక కౌన్సిల్ సమావేశంలో వీబీఆర్ కాలనీలోని 50 సెంట్ల స్థలాన్ని ఎన్.రామయ్య ప్రాథమిక పాఠశాలకు కేటాయించారు. నాడు–నేడు పనులలో భాగంగా రూ. 21 లక్షలతో తరగతి గది, వంటగది, టాయిలెట్స్ నిర్మించి విద్యుత్, తాగునీటి వసతి వంటి సౌకర్యాలను కల్పించారు.

గదుల కొరతతో ఇబ్బందులు

37 మంది విద్యార్థులతో ప్రారంభమైన ఎన్.రామయ్య పాఠశాలలో నేడు 1 నుంచి 5వ తరగతి వరకు 94 మంది విద్యార్థులు ఉన్నారు. అయితే పాఠశాలకు తరగతి గది ఒక్కటే ఉండడంతో ప్రస్తుతం విద్యార్థుల సంఖ్యకు సరిపోవడంలేదు. దీంతో అటు ఉపాధ్యాయులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గదిలోనే ఇద్దరు ఉపాధ్యాయులు 4,5 తరగతుల విద్యార్థులను ఎదురు ఎదురుగా కూర్చొబెట్టుకుని విద్యాబోధనను కొనసాగిస్తున్నారు. 3, 2 తరగతులను వరండాలో, 1వ తరగతిని కిచెన్ షెడ్డులలో నిర్వహిస్తూ విద్యార్థులకు విద్యాబోధన అందిస్తున్నారు. కొన్ని సార్లు ఎవరు ఏమి చెపుతున్నారో తెలియని పరిస్థితి. విద్యార్థులు అంతా కలవిడి కవాడంతో గందర గోళంగా ఉంటుంది. నాణ్యమైన విద్య అందాలి అంటే కూటమి ప్రభుత్వం స్పందించి విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదులు నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

ప్రభుత్వం స్పందించాలి

విద్యార్థులకు తరగతి గదులు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఒకే తరగతి గది ఉంది. అందులోనే ఉపాధ్యాయులు విద్యాబోధనను అందిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి అదనపు తరగతి గదులను నిర్మించాలి. ప్రస్తుత పరిస్థితిలో విద్యార్థులు ఇబ్బందులు పడకుండా దాతలు ఎవరైనా స్పందించి రేకుల షెడ్లు వంటివి ఏర్పాటు చేస్తే బాగుంటుంది. పేద మధ్య తరగతి పిల్లలు చువుకునే వారికి మంచి చేసిన వారవుతారు. **– పి.రమేష్, టీడీఎస్‌ఎఫ్ రాష్ట్ర కన్వీనర్**

గదుల కొరత ఉంది



పాఠశాలకు అదనపు తరగతి గదుల కొరత ఉంది. ఉన్న ఒక గదిలో, వరండా, కిచెన్ షెడ్డులలో విద్యార్థులను కూర్చోబెట్టి విద్యను అందిస్తున్నాం. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఇంకా మాకు మూడు గదులు అవసరం ఉంది. నాడు- నేడు పథకం కింద మంజూరైన నిధులతోనే ఒక తరగతి గది, వంటగది, టాయిలెట్స్ వంటి సౌకర్యాలను కల్పించాం. విద్యార్థుల సంఖ్య అనుగుణంగా తరగతి గదులు అవసరం అవుతాయని అధికారులకు కూడా విన్నవించాం. ప్రభుత్వం నిధులు మంజూరు చేసి గదులను నిర్మాణం చేపడితే సమస్య తీరుతుంది.

– జగన్‌మోహన్‌రావు, హెచ్‌ఎం, ఎస్. రామయ్య పురపాలక ప్రాథమిక పాఠశాల ఆదోని

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు



ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రజలను విచారిస్తున్న సీఐ మంజునాథ్, ఎస్ఐ చంద్రమోహన్

కోసిగి: బహిరంగ ప్రాంతాలలో మద్యం తాగితే కఠిన చర్యలు తప్పవని కోసిగి సీఐ మంజునాథ్ హెచ్చరించారు. బుధవారం కోసిగిలోని ఆర్టీసీ బస్టాండ్, తేరుబజారు బహిరంగ ప్రాంతాలను ఎస్ఐ చంద్రమోహన్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. బస్టాండ్ పరిసరాలలో అనుమానాస్పదంగా ఉన్న వారిని విచారించారు. ఆయన మాట్లాడుతూ హోటళ్లు, దుకాణాలు, బంక్‌లలో మద్యం తాగడానికి అనుమతించరాదన్నారు. రోడ్ల పైన, బహిరంగ ప్రాంతాలలో తాగిన మద్యం సీసాలు, వాటర్ పాకెట్లను పడేసినా, దుకాణాలు ముందు భాగంలో పడి ఉన్నా వారిపై చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. అలాగే ఆర్టీసీ బస్టాండ్‌లో ఆటోలను ఇష్టానుసారంగా పెట్టుకుని ప్రయాణికులకు బస్సుల రాకపోకలకు అంతరాయం కల్గించవద్దని ఆటో డ్రైవర్లకు సూచించారు.

మున్సిపల్ టెండర్లు

ఆదోనిటౌన్: 2024–25 ఆర్థిక సంవత్సరంలో మున్సిపాలిటీ పరిధిలో పలు అభివృద్ధి పనులకు సంబంధించిన టెండర్లు లెస్(తక్కువ)కు దాఖలయ్యాయి. మున్సిపల్ జనరల్ ఫండ్స్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నిధులు రూ.1.42 కోట్లతో 21 అభివృద్ధి పనులు చేపట్టేందుకు నెలలో ఆన్‌లైన్‌లో టెండర్లను మున్సిపల్ అధికారులు పిలిచారు. అందులో జనరల్ ఫండ్స్ కింద 14 పనులు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ కింద ఆరు సామూహిక మరుగుదొడ్ల నిర్మాణాలు ఉన్నాయి. టెండర్లను ఓపెన్ చేయగా, టెండర్లు లెస్‌కు దాఖలయ్యాయని మున్సిపల్ కమిషనర్ కృష్ణ తెలిపారు. రూ.70 లక్షలతో ఆరు సామూహిక మరుగుదొడ్ల నిర్మాణం, రూ.74 లక్షలతో 14 అభివృద్ధి పనులు, సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణం, కల్వర్టుల ఏర్పాటు చేయనున్నారు. త్వరలోనే పనులను ప్రారంభించేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు



మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ గంటా సుబ్బారావు

ఆదోని అర్బన్: గ్రంథాలయాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆదోని ట్రాఫిక్ సీఐ గంటా సుబ్బారావు అన్నారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు వేడుకలు బుధవారం స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి సుజాత ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన ఆయా పోటీల్లో విజేతలకు ట్రాఫిక్ సీఐ గంటా సుబ్బారావు, శ్రీ చైతన్య ఇంగ్లిష్ మీడియం ప్రిన్సిపాల్ హరికృష్ణ చేతులమీదుగా బహుమతులను ప్రదానం చేశారు.

ఆదోని సెంట్రల్: ప్రతి విద్యార్థినీ, విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ మురళీమోహన్ తెలిపారు. బుధవారం కళాశాలలో గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం ఘనంగా జరిగింది. వ్యాసరచన పోటీలలో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమలో వైస్ ప్రిన్సిపాల్ బాలస్వామి, అధ్యాపకులు అయ్యప్ప, మధు, రామకృష్ణ, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దకడబూరు : గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఉపాధ్యాయులు మల్లికార్జున, రాఘవేంద్ర ఆధ్వర్యంలో వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు గ్రంథాలయ అధికారిణి ఆశాజ్యోతి బహుమతులు ప్రదానం చేశారు.

కోసిగి: స్థానిక సంతమార్కెట్‌లోని గ్రంథాలయ కార్యాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు వేడుకలు ఘనంగా జరిగాయి. గ్రంథాలయాధికారి దుల్లయ్య ఆధ్వర్యంలో విద్యార్థులకు క్రీడలు, వ్యాసరచన, వాలీబాల్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో బాలికల ఉన్నత పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్ఎం శ్రీదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరుటౌన్: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక గ్రంథాలయంలో విద్యార్థినులకు నిర్వహించిన పలుపోటీల్లో విజేతలకు గ్రంథాలయాధికారి హరికృష్ణ, బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ విజయరాణి, బాలికల హైస్కూల్ ఉపాధ్యాయిని లక్ష్మీదేవి బహుమతులు, ప్రసంశా ప్రత్రాలను అందజేశారు.

హెచ్ఆర్‌సీ, లోకాయుక్తలను తరలించొద్దు



సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీనియర్, జూనియర్ న్యాయవాదులు

ఆదోని రూరల్: రాష్ట్ర మానవ హక్కుల కమిషన్, ఏపీ లోకాయుక్తలను కర్నూలు నుంచి అమరావతికి తరలించడాన్ని నిరసిస్తూ బుధవారం ఆదోని అడ్వకేట్స్ బార్ అసోసియేషన్ సభ్యులు కోర్టుల విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. కోర్టు ఆవరణ నుంచి భీమా సర్కిల్ మీదుగా సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతి పత్రం అందజేశారు. సీనియర్ న్యాయవాది దేశాయ్ మీడియాతో మాట్లాడుతూ.. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని నెరవేర్చకుండా కర్నూలు నుంచి హెచ్‌ఆర్‌సీ, ఏపీ లోకాయుక్తలను అమరావతికి తరలించాలని సూత్రప్రాయంగా నిర్ణయించామని హైకోర్టుకు ప్రభుత్వం తెలపడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తొలి కేబినెట్‌లో అధికారిక చొరవ తీసుకుని కర్నూలులో ఏపీ హైకోర్టు బెంచ్‌ను వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. ప్రెసిడెంట్ ఎల్.కె.సుందర్‌సింగ్ మాట్లాడుతూ శ్రీబాగ్ ఒప్పందం ప్రకారం ఏపీ హైకోర్టు ఏర్పాటు రాయలసీమ ప్రజల న్యాయబద్ధమైన హక్కు అని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ ఎల్.కె.సుందర్‌సింగ్, న్యాయవాదులు జనార్దన్, జీవన్, లోకేష్, శివప్రసాద్, బంగారయ్య, నాగేంద్రయ్య, ఆనంద్, రజనీకాంత్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి పి.మురళీ మోహన్ రెడ్డి

కోసిగి: మండల కేంద్రం కోసిగికి చెందిన దళవాయి ఉలిగమ్మ (50) అనే వైఎస్సార్ సీపీ మహిళా కార్యకర్త మంగళవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. బుధవారం ఆదోని ఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టం చేయించి మృతదేహాన్ని కోసిగికి తీసుకొచ్చారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి పి. మురళీమోహన్ రెడ్డి కోసిగికి చేరుకుని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమెకు భర్త వెంకటేష్, 9 మంది కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ఎమ్మెల్యే వై.బాలనాగి రెడ్డి తరుపున ఆమె అంత్యక్రియల నిమిత్తం రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఆ కుటుంబానికి ఎల్లప్పుడు రాంపురం రెడ్డి సోదరులు అండగా ఉంటారని భరోసా కల్పించారు. వైఎస్సార్ సీపీ మండల నాయకులు మంగమ్మ, నాగరాజు, జగదీష్ స్వామి, అయ్యప్ప, అంజి ఉన్నారు.

24న కురువల వనభోజనాలు

గోనెగండ్ల : ఎమ్మిగనూరు వీవర్స్ కాలనీలో ఈనెల 24న జరిగే కురువల వనభోజన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కురువ సంఘం నాయకుడు పిల్లిగుండ్ల కృష్ణ పిలుపునిచ్చారు. బుధవారం ఆయన మాట్లాడుతూ కనకదాసు 537వ జయంతి సందర్భంగా కార్తీక వన భోజనాలు ఎమ్మిగనూరులోని గ్లోబల్ ఇండస్ స్కూల్‌లో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని కురువ, కురుబ, మాదాసి, కురువ సంఘం నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అంధకారంలో ఐరన్‌బండ

గోనెగండ్ల : మండల పరిధిలోని ఐరన్‌బండ గ్రామంలోని ఎస్సీ, బీసీ కాలనీలకు రెండు రోజులుగా విద్యుత్ సరఫరా లేకపోవడంతో అంధకారంలో ఉండిపోయాయి. ఇటీవల ఆర్డీఎస్ సంస్థ కింద పాత విద్యుత్ స్తంభాలను తొలగించి వాటి స్థానంలో కొత్త స్తంభాలను విద్యుత్ అధికారులు ఏర్పాటు చేశారు. అలాగే విద్యుత్ వైర్లను కూడా లాగుతున్నారు. అయితే గ్రామంలోని పాత స్తంభాల నుంచి పంట పొలాలకు కూడా త్రీఫేస్ విద్యుత్ సరఫరా అయ్యేది. సమస్య వచ్చినప్పుడల్లా గృహాలకు కూడా విద్యుత్ నిలిచిపోయి గ్రామస్తులు ఇబ్బందులు పడ్డారు. దీంతో పంట పొలాలకు ప్రత్యేక లైన్ ఏర్పాటు చేసి, గ్రామంలోని ఇళ్లకు మాత్రం సింగిల్ ఫేస్ కనెక్షన్ ఇవ్వాలని కాలనీ వాసులు కోరుతున్నారు. అయితే విద్యుత్ అధికారులు మాత్రం పాత పద్ధతిలోనే త్రీఫేస్ కనెక్షన్ ఇస్తామంటున్నారు. ఇందుకు గ్రామస్తులు ఒప్పుకోక పోవడంతో అధికారులు పనులు నిలిపివేశారు. దీంతో గ్రామంలోని రెండు కాలనీలు విద్యుత్‌లేక అంధకారంలో మగ్గుతున్నాయి. అధికారులు గ్రామ పెద్దలతో మాట్లాడి తగు చర్యలు తీసుకొని ఇళ్లకు విద్యుత్ సరఫరా చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పంటనష్ట ప్రాథమిక జాబితా ప్రదర్శన

పెద్దకడబూరు : ఖరీఫ్ 2024 పంటలకు సంబంధించిన పంటనష్టం ప్రాథమిక జాబితాను అన్ని రైతుసేవా కేంద్రాలలో సామాజిక తనిఖీ కోసం ప్రదర్శించడం జరిగిందని, రైతులు ఆ జాబితాను పరిశీలించుకోవాలని ఏఓ ఎం.వరప్రసాద్ సూచించారు. మండల కేంద్రంలోని రైతుసేవా కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన గ్రామ సభలో ఆయన మాట్లాడుతూ.. ఖరీఫ్ 2024లో పెద్దకడబూరు మండలాన్ని కరువు మండలంగా ప్రభుత్వం ప్రకటించడం జరిగిందన్నారు. దానికి అనుగుణంగా వర్షాధారం కింద పండించిన పత్తి, వేరుశనగ, ఆముదము, సజ్జ పంటలను చేరుస్తూ ప్రాథమిక పంట నష్ట జాబితాను తయారు చేశామన్నారు. జాబితాలో ఏమైనా పొరపాట్లు ఉంటే ఈ నెల 24వ తేదీలోపు తెలియజేయాలన్నారు.



జాబితాను విడుదల చేస్తున్న ఏఓ వరప్రసాద్

గృహాలను ఆన్‌లైన్ చేసుకోవాలి



గోనెగండ్లలో ఆన్‌లైన్ చేస్తున్న పంచాయతీ సిబ్బంది

గోనెగండ్ల : మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో గృహాల యజమానులు తప్పనిసరిగా స్వర్ణపంచాయతీ కార్యక్రమంలో తమ గృహాలను ఆన్‌లైన్ చేయించుకోవాలని ఈఓఆర్డీ అనంతసేన, గోనెగండ్ల పంచాయతీ ఈఓ సతీష్ సూచించారు. బుధవారం వారు మాట్లాడుతూ జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు రెండు రోజులుగా ప్రతి గ్రామ పంచాయతీలో నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. మండలంలోని 20 గ్రామ పంచాయతీల్లో ఉన్న గృహాల వారు 2024–25 సంవత్సరానికి చెందిన ఇంటి పన్ను చెల్లించి ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసిన స్వర్ణ పంచాయతీలో ఆన్‌లైన్ చేసుకోవాలన్నారు. మండలంలో 13,621 గృహాలు ఉన్నాయని, గోనెగండ్లలో 4,760 గృహాలు ఉన్నాయన్నారు. ఆన్‌లైన్‌కు ఎటువంటి ఫీజులు లేవని, ఇంటి పన్ను రసీదు, ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకొని వస్తే పంచాయతీ సిబ్బంది ఉచితంగా ఆన్‌లైన్ చేస్తారన్నారు. ఈనెల చివరి లోపు తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు.

ప్రశాంతంగా జీవించండి



మాట్లాడుతున్న డీఎస్పీ ఉపేంద్రబాబు

కౌతాళం : ప్రజలు గ్రామాలలో ప్రశాంతంగా జీవించాలని, అప్పుడే శాంతి నెలకొంటుందని ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబు అన్నారు. బుధవారం రాత్రి మండలంలోని ఫ్యాక్షన్ గ్రామమైన రౌడూరును సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడుతూ ఎవరూ ఫ్యాక్షన్ జోలికి, అసాంఘిక కాలాపాలకు, ఘర్షణలకు పాల్పడకుండా ప్రశాంతమైన జీవతాన్ని గడపాలన్నారు. గ్రామాల్లో అందరు కలికట్టుగా ఉంటే మన అభివృద్ధితో పాటు గ్రామం కూడా అభివృద్ధి చెందుతుందన్నారు. సీఐ అశోక్ కుమార్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

రేపు కాపు, బలిజ కార్తీక వనభోజనాలు



కరపత్రాలను విడుదల చేస్తున్న కాపు, బలిజులు

ఆదోని టౌన్: స్థానిక ఆస్పరి రోడ్డులో వెలిసిన శ్రీ లక్ష్మీ నరసింహస్వామి సన్నిధిలో ఈనెల 22న కాపు, బలిజ, తెలగ కార్తీక వనభోజనోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం అధ్యక్ష కార్యదర్శులు కరణం రంగస్వామి, మల్లికార్జున తెలిపారు. బుధవారం స్థానిక భీమాస్ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. లక్ష్మీనరసింహస్వామి ఆలయ 17వ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేకంగా కార్తీక వనభోజనం, ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. ఆదోని నియోజకవర్గంలోని కాపు, బలిజులు విరివిగా వనభోజన కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఉదయం 9 గంటల నుంచి స్వామివారికి పూజలు ప్రారంభమై మధ్యాహ్నం 1 గంట వరకు కొనసాగుతాయన్నారు. అనంతరం అన్నదానం జరుగుతుందన్నారు. ఉదయం నుంచే ఉచిత వైద్యశిబిరంలో పరీక్షలు చేయడం, మందులు ఇచ్చే కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. సమావేశంలో నాయకులు రవికుమార్, శ్రీనివాసులు, మాణిక్యరెడ్డి, జి.సి.రంగన్న, కాపు నాడు జిల్లా అధ్యక్షుడు భీమలింగప్ప, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

24న రెడ్డి జనసంఘం ఆధ్వర్యంలో..

పట్టణంలోని రెడ్డీస్ హాస్టల్‌లో ఈనెల 24న కార్తీక మాస వనభోజనోత్సవ కార్యక్రమం జరుగుతుందని రెడ్డి జనసంఘం నాయకులు బుధవారం తెలిపారు. కార్తీకమాసాన్ని పురస్కరించుకుని ధాత్రి పూజ, కార్తీక భోజనం ఏర్పాటు చేయడం జరిగిందని, ఆ సంఘం నాయకులు రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ధాత్రి పూజ, 11.30 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు, 1 గంటకు భోజనం(విందు), సాయంత్రం 4 గంటలకు ముగింపు కార్యక్రమాలు ఉంటాయన్నారు. రెడ్డి జనసంఘం నాయకులు విరివిగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

పెద్దకడబూరు : మండల పరిధిలోని హనుమాపురం గ్రామంలో సీఐ భార్గవరెడ్డి, ఎమ్మిగనూరు ఎక్సైజ్ సీఐ మొయినుద్దీన్, సిబ్బందితో కలిసి బుధవారం తనిఖీలు నిర్వహించారు. బస్టాండ్ సమీపంలో అదే గ్రామానికి చెందిన మహేష్ కర్ణాటక మద్యం అమ్ముతూ పట్టుబడ్డాడు. నిందితుడి వద్ద నుంచి 96 (90 ఎంఎల్) కర్ణాటక టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని, అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. కోసిగి సర్కిల్ పరిధిలో (పెద్దకడబూరు, కోసిగి మండలాల్లో) ఎక్కడైనా అక్రమంగా మద్యం, నాటుసారా అమ్ముతున్నట్లు, తయారు చేస్తున్నట్లు తెలిస్తే 94409 02580 నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని సీఐ భార్గవరెడ్డి తెలిపారు.

వేదావతినదిపై ప్రాజెక్టు నిర్మించాలి



ధర్నా చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

ఆలూరు: హాలహర్వి మండలం గూళ్యం గ్రామం వద్ద నిర్మించతలపెట్టిన వేదావతి నదిపై ప్రాజెక్టు పనులను వెంటనే ప్రారంభించాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహం నుంచి సీపీఎం, సీపీఐ, కాంగ్రెస్ పార్టీ, ఎమ్మార్పీఎస్, డీవైఎఫ్ఐ, ఏపీ రైతు సంఘం, వ్యవసాయకార్మిక సంఘం తదితర సంఘాల నాయకులు ఆలూరు మండల సీపీఎం కార్యదర్శి షాకీర్ నేతృత్వంలో అంబేడ్కర్ సర్కిల్ వరకు ర్యాలీగా తరలివచ్చి అక్కడ ధర్నా, రస్తారోకో చేపట్టారు. దీంతో వివిధ ప్రాంతాలకు వెళ్లే వాహనాలు భారీగా నిలిచిపోవడంతో ఆలూరు సీఐ వెంకటచలపతి సమక్షంలో ఎస్ఐ దిలీప్‌కుమార్, హాలహర్వి ఎస్ఐ చంద్ర , పోలీసులు ధర్నా విరమించాలని సూచించారు. అయినా వారు వినిపించుకోకపోగా ధర్నా కొనసాగించడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని, పోలీసులు గట్టిగా సూచించడంతో ప్రజా సంఘాల నాయకుల మధ్య వాదన జరిగింది. సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి గౌస్‌దేశాయ్, సీపీఎం జిల్లా కార్యవర్గదర్శి సభ్యుడు పీఎస్.రాధాకృష్ణ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ లక్ష్మినారాయణ, సీపీఐ జిల్లా రైతు సంఘం కార్యదర్శి రామకృష్ణ, బీఎస్పీ ఇన్‌చార్జ్ రామలింగయ్య తదితరులు మాట్లాడారు. ఎన్నికల సమయంలో చంద్రబాబునాయుడు వేదావతినదిపై ప్రాజెక్టు నిర్మించి 8 టీఎంసీలు నీటిని నిలువ చేస్తామని హామీ ఇచ్చారని, ఆ హామీని నిలబెట్టుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆలూరు నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు కత్తి రామాంజనేయులు, సీపీఎం నాయకులు నారాయణస్వామి, హను మంతు, బాలకృష్ణ, వెంకటేశ్వర్లు, ఈరన్న పాల్గొన్నారు.